


CNR
CVSR DIGITAL NEWS




20 సెప్టెంబర్ 2026 | ప్రత్యేక సంచిక | cvsr.in

# కమలం.. రెండు ఎత్తులు!

## తెలంగాణలో రాజ్యాంగం.. బెంగాల్‌లో రాజకీయం?




అధికారం లేని చోట రాజ్యాంగ విలువల అస్త్రం.. అధికారం ఉన్న చోట ప్రత్యర్థుల రాజకీయ స్థలాన్ని కుదించే ఎత్తుగడలు.. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ రాజకీయాలను గమనిస్తే రాష్ట్రానికో వ్యూహం కనిపిస్తోందన్న చర్చ సాగుతోంది. తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై కోర్టు తీర్పును రాజకీయ అస్త్రంగా మలుచుకుంటున్న కమలనాథులు.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం మమతా బెనర్జీకి వరుసగా ఎదురవుతున్న రాజకీయ పరిణామాల మధ్య అధికారంలో ఉన్నారు. దీంతో ఒకే కమలం.. రెండు రాష్ట్రాలు.. రెండు రకాల రాజకీయ ఎత్తులా అన్న విశ్లేషణలు ఊపందుకుంటున్నాయి.

### దానం తీర్పుతో రాజకీయ అస్త్రం

తెలంగాణలో దానం నాగేందర్ వ్యవహారం ఇందుకు తాజా ఉదాహరణగా నిలుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం.. ఆ తర్వాత కాంగ్రెస్ వైపు వెళ్లి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనను 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఈ వ్యవహారంలో పిటిషనర్లుగా ఉన్నారు. దానం ప్రస్తుతం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

### రాజ్యాంగ విజయమంటూ కాంగ్రెస్‌పై ఎదురుదాడి

హైకోర్టు తీర్పు బీజేపీకి తెలంగాణలో బలమైన రాజకీయ అస్త్రాన్ని అందించింది. పార్టీ ఫిరాయింపులకు ఇది గుణపాఠమని.. కాంగ్రెస్ అనుసరిస్తున్న రాజకీయాలకు ఎదురుదెబ్బ అని కమలనాథులు ప్రచారం చేస్తున్నారు. ప్రజలు ఒక పార్టీ తరఫున ఎన్నుకున్న ఎమ్మెల్యే మరో పార్టీ వైపు వెళ్లడాన్ని ప్రశ్నిస్తూ రాజ్యాంగ విలువలు, ప్రజాతీర్పు, రాజకీయ నైతికతను ముందుకు తెస్తున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు దానం వ్యవహారాన్ని బీజేపీ విస్తృతంగా ఉపయోగించుకునే ప్రయత్నం కనిపిస్తోంది.

### బెంగాల్ లో మారుతున్న పొలిటికల్ సీన్

పశ్చిమ బెంగాల్‌లో మాత్రం రాజకీయ పరిస్థితులు మరోలా కనిపిస్తున్నాయి. అక్కడ అధికారం బీజేపీ చేతిలో ఉండగా ప్రధాన రాజకీయ ప్రత్యర్థి మమతా బెనర్జీ వరుస సవాళ్లను ఎదుర్కొంటున్నారు. తృణమూల్ కాంగ్రెస్‌లో చీలికతో మొదలైన సంక్షోభం పార్టీపై ఆధిపత్య పోరు వరకు వెళ్లింది. రెండు వర్గాలు అసలు పార్టీ తమదేనంటూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడంతో తృణమూల్ కాంగ్రెస్ పేరు, పూలు - గడ్డి గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా ఫ్రీజ్ చేసింది. మమత వర్గానికి కొత్త పేరు, ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తు కేటాయించగా ప్రత్యర్థి వర్గానికి మరో పేరు, ఎన్వలప్ గుర్తు కేటాయించారు. అసలు పార్టీ ఎవరిదన్న తుది నిర్ణయం ఇంకా రావాల్సి ఉంది.

### నందిగ్రామ్‌లో అనూహ్య రాజకీయం

ఈ సంక్షోభం కొనసాగుతుండగానే నందిగ్రామ్ ఉపఎన్నికలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మమతా వర్గం తరఫున బరిలోకి దిగిన సంచితా ప్రధాన్ దే ఎన్నికల పోరు కీలక దశలో ఉండగా ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిశారు. ఆ తర్వాత ఆమె పోటీ నుంచి తప్పుకున్నారు. ప్రధాన ప్రత్యర్థి వర్గానికి చెందిన అభ్యర్థి ముఖ్యమంత్రిని కలవడం.. ఆ వెంటనే ఎన్నికల బరి నుంచి తప్పుకోవడం రాజకీయ వర్గాల్లో అనుమానాలకు ఆస్కారం కల్పించింది.

### మమత మద్దతుతో మలుపుతిరిగిన పోరు

తన వర్గం అభ్యర్థి తప్పుకోవడంతో మమతా బెనర్జీ నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ప్రకటించారు. బెంగాల్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాలకు సంకేతంగా కనిపించిన ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే మరో పరిణామం చోటుచేసుకుంది. మిలన్ ప్రధాన్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో నందిగ్రామ్ ఉపఎన్నిక ఒక్కసారిగా రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది.

### ఎన్నికల వేళ తెరపైకి 19ఏళ్ల కేసులు

మిలన్ ప్రధాన్ అరెస్టుకు కారణమైనవి కొత్త కేసులు కావు. 2007 నందిగ్రామ్ భూసేకరణ వ్యతిరేక ఉద్యమానికి సంబంధించిన 4 పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్ల ఆధారంగా ఆయనను అరెస్టు చేశారు. కోర్టు ఆయనను అక్టోబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. అక్టోబర్ 6న ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో పోలింగ్‌కు మూడు రోజుల ముందు వరకు అభ్యర్థి జ్యుడీషియల్ కస్టడీలో ఉండే పరిస్థితి ఏర్పడటం ఈ వ్యవహారానికి రాజకీయ ప్రాధాన్యం పెంచింది. దాదాపు రెండు దశాబ్దాల నాటి కేసుల్లోని వారెంట్లు సరిగ్గా ఉపఎన్నికల సమయంలోనే అమల్లోకి రావడం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. మమతా బెనర్జీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించిన కొన్ని గంటల్లోనే అరెస్టు జరగడంతో టైమింగ్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాత కేసులు ఎన్నికల వేళే ఎందుకు కదిలాయన్న ప్రశ్నలు వినిపిస్తుండగా.. ప్రత్యర్థులకు రాజకీయ స్థలం లేకుండా చేసే ప్రయత్నమంటూ ఆరోపణలు కూడా తెరపైకి వస్తున్నాయి.

### కుదించుకుపోతున్న మమత పొలిటికల్ ప్లేస్

తృణమూల్‌లో చీలిక.. పార్టీ పేరు, గుర్తుపై వివాదం.. కొత్త గుర్తుతో ఎన్నికలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి.. నందిగ్రామ్‌లో మమత వర్గం అభ్యర్థి ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత పోటీ నుంచి తప్పుకోవడం.. ఆమె మద్దతిచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి పాత కేసుల్లో అరెస్టు కావడం.. ఈ పరిణామాలన్నింటినీ కలిపి చూస్తే మమతా బెనర్జీ రాజకీయ స్థలాన్ని క్రమంగా కుదించే ప్రయత్నం జరుగుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో ఘటనకు ఒక్కో కారణం కనిపిస్తున్నప్పటికీ వరుస పరిణామాల రాజకీయ లబ్ధి ఎటువైపు వెళ్తోందన్న అంశంపై విశ్లేషణలు ఊపందుకుంటున్నాయి.

### అధికారం మారితే రాజకీయ ఎత్తూ మారుతుందా?

తెలంగాణలో అధికారంలో లేని బీజేపీ దానం నాగేందర్ వ్యవహారాన్ని రాజ్యాంగ విలువలు, పార్టీ ఫిరాయింపులు, ప్రజాతీర్పు అనే అస్త్రాలతో కాంగ్రెస్‌పై ప్రయోగిస్తోంది. బెంగాల్‌లో అధికారం చేతిలో ఉన్న సమయంలో ప్రధాన ప్రత్యర్థి మమతా బెనర్జీ పార్టీ చీలిక నుంచి గుర్తు వివాదం వరకు.. అభ్యర్థి ఉపసంహరణ నుంచి మద్దతిచ్చిన అభ్యర్థి అరెస్టు వరకు వరుస రాజకీయ చిక్కులను ఎదుర్కొంటున్నారు. రాజకీయాల్లో ఎత్తులు సహజమే అయినా.. అధికారం లేని చోట రాజ్యాంగ నైతికతను ఆయుధంగా చేసుకుంటూ.. అధికారం ఉన్న చోట ప్రత్యర్థి రాజకీయ స్థలం కుదించుకుపోతున్న పరిణామాల మధ్య నిలవడం.. రాష్ట్రం మారితే కమలం రాజకీయ వ్యూహం కూడా మారుతోందా అన్న చర్చకు ఆస్కారం కల్పిస్తోంది.

రక్తదానం చేద్దాం - ప్రాణాలు కాపాడుదాం

© 2026 CVSR Digital News | cvsr.in | Privacy Policy | Terms & Conditions